సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ
సోమవారం । 12 । ఫిబ్రవరి । 2024



డెల్టాలకు 8 వేల క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 8 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,300, మధ్య డెల్టాకు 1,700, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 9.80 అడుగులకు చేరింది.



రూ.లక్ష సమర్పణ

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి టి.శ్రీకాంత్, సత్యవాణి దంపతులు (బయ్యనగూడెం) ఆదివారం రూ.1,00,008 విరాళం సమర్పించారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1,00,116 విరాళం



సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదాన ట్రస్ట్‌కు ఎస్.శ్రీనివాస ఫణి పవన్‌కుమార్ (విజయవాడ) రూ.1,00,116 విరాళం అందజేశారు.

న్యూస్‌రీల్

బాలాజీ సన్నిధిలో భక్తుల సందడి



స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్ రామకృష్ణ

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీబాల బాలాజీ స్వామి ఆలయానికి ఆదివారం భక్తులు భారీగా వచ్చారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.1.81 లక్షల ఆదాయం వచ్చింది. టిక్కెట్లు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.1.33 లక్షల ఆదాయం లభించింది. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.47,669 విరాళాలు సమర్పించారు. 2,783 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. 2,064 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారని ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. కాకినాడకు చెందిన చెక్క వెంకటేశ్వరరావు, జ్యోతి దంపతులు స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.10,116 విరాళంగా అందించారు. వెంకటేశ్వరరావు దంపతులకు ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, ఆలయ అర్చకులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

23 నుంచి టెన్త్ ప్రీ ఫైనల్

రాయవరం: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ముందుగా ప్రీ ఫైనల్ పరీక్షలు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 18వ తేదీ నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనున్న నేపథ్యంలో ఈ నెల 23 నుంచి మార్చి 4వ తేదీ వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించేందుకు ఎస్సీఈఆర్‌టీ డైరెక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి టైమ్ టేబుల్ విడుదల చేశారు. పబ్లిక్ పరీక్షలు మాదిరిగానే ప్రీ ఫైనల్ పరీక్షలను కూడా నిర్వహించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోంది. మధ్యాహ్నం 1.15 నుంచి మధ్యాహ్నం 4.30 గంటల వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్ పేపర్లు మాత్రం మధ్యాహ్నం 1.15 నుంచి 3.15 గంటల వరకు నిర్వహిస్తారు. 23న ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు) 100 మార్కులకు, కాంపొజిట్ కోర్సు విద్యార్థులకు 70 మార్కులకు నిర్వహిస్తారు. 24న సెకండ్ లాంగ్వేజ్ హిందీ 100 మార్కులకు, 26న ఇంగ్లిషు 100 మార్కులు, 27న గణితం 100 మార్కులు, 28న ఫిజికల్ సైన్స్ 50 మార్కులకు, 29న బయలాజికల్ సైన్స్ 50 మార్కులకు, ఏప్రిల్1న సోషల్ స్టడీస్ 100 మార్కులు, ఏప్రిల్ 2న ఫస్ట్ లాంగ్వేజ్ పేపరు(కాంపోజిట్ కోర్సు) 30 మార్కులకు, ఓఎస్ఎస్‌సీ(సంస్కృతం, అరబిక్, పర్షియన్) పేపర్–1 100 మార్కులకు, ఏప్రిల్ 4న ఓఎస్ఎస్‌సీ(సంస్కృతం, అరబిక్, పర్షియన్) పేపర్–2 100 మార్కులకు నిర్వహించనున్నారు.

నేడు యథావిధిగా స్పందన

అమలాపురం రూరల్ : అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లా స్థాయి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన- జగనన్నకు చెబుదాం కార్యక్రమం సోమవారం యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా అర్జీదారులు తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి పరిష్కార మార్గాలు కోరాలని ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

కాలానికి ఎవ్వరూ అతీతులు కాలేరు

పిఠాపురం: కాల పరీక్షలు ఎదుర్కోవాలంటే ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక తత్వాన్ని పెంపొందించుకోవాలని, కాలానికి ఎవ్వరూ అతీతులు కారు, కాలేరని శ్రీ విశ్వ విజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం అధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అన్నారు. పీఠం 96వ వార్షిక మహాసభల ముగింపు సందర్భంగా ఆశ్రమ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన సభలో ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసం చేశారు. కాలానికి అతీతంగా ప్రయాణించే ఏ జీవీ సృష్టిలో లేదని చెప్పారు. ఆధ్యాత్మికత, తాత్విక జ్ఞాన మార్గాన్ని ఆచరిస్తే సుఖదుఃఖాలను ఒకేలా చూడగలిగే స్థితిని పొందే అవకాశం ఏర్పడుతుందన్నారు. గురువును ఆశ్రయించి, భ్రాంతులను తొలగించుకున్నప్పుడే మనిషి తనలోని పరమాత్మను దర్శించుకోగలుగుతాడని చెప్పారు. ఈ సందర్భంగా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ద్వారా పలువురు పేదలకు కుట్టు మెషీన్లు, పక్షులకు ఆహారంగా ఇచ్చే ధాన్యపు కుచ్చులను డాక్టర్ ఉమర్ ఆలీషా పంపిణీ చేసారు. భవిత ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు ఎన్ఆర్ఐ సభ్యులు పేరూరి ఉమా అరవింద్, విజయరామ సుబ్బారావు సమకూర్చిన ప్రింటర్‌ను అందజేసారు. పీఠం ఆధ్వర్యాన రూపొందించిన పలు కరదీపికలను, గ్రంథాలను ఆవిష్కరించారు. కాకినాడ ఎంపీ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత, విశ్వనాథ్, సాహితీవేత్త జానకి రామచౌదరి, కాకినాడ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల బుజ్జి, ఎస్‌సీఎస్ ఇండస్ట్రీస్ అధినేత నారాయణం మురళి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె.పద్మరాజు తదితరులకు జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆకర్షిస్తున్న తాజా ధనం

- దూసుకుపోతున్న మడికి కూరగాయల మార్కెట్
- ప్రతి రోజూ సుమారు 600 టన్నుల ఎగుమతి
- జాతీయ స్థాయికి విస్తరిస్తున్న వైనం
- ఆర్‌బీకేల ఏర్పాటుతో లాభసాటిగా సాగు
- కరోనాలోనూ నిరంతరం సరఫరా

ఆలమూరు: ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కూరగాయల సాగులో దూసుకుపోతోంది. వైఎస్సార్ సీపీ నేతృత్వంలో ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలతో కూరగాయల సాగు రోజు రోజుకు పెరుగుతోంది. విపత్తుల సమయంలోనూ కూరగాయలు అందుబాటులో ఉండటం వల్ల మడికి కూరగాయల మార్కెట్ ప్రత్యేకత సంతరించుకుంది. కోనసీమ, మెట్ట, చాగల్నాడు, లంక భూముల్లో సాగు చేస్తున్న కూరగాయలు ఇక్కడకు వస్తున్న నేపథ్యంలో అంతర్రాష్ట్ర మార్కెట్‌గా ఎదిగింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిసర ప్రాంతాల్లో సుమారు పది వేల ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతుంది. ఈ పండించిన కూరగాయలను నిత్యం 216ఏ జాతీయ రహదారి చెంతన ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఆలమూరు మండలంలోని మడికి కూరగాయల మార్కెట్‌కు తరలిస్తారు. ఉద్యానశాఖకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల వల్ల కూరగాయల సాగు లాభసాటి కావడంతో రైతులు మెరుగైన జీవనోపాధి పొందుతున్నారు. దీనివల్ల వినియోగదారులకు నాణ్యమైన కూరగాయలు లభిస్తున్నాయి. ఒక్కొక్కసారి కూరగాయల కొరత వస్తే సత్వరమే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధి చెందిన మార్కెట్ల నుంచి కూరగాయలు దిగుమతి చేసుకుని స్థానికంగా ఎదురయ్యే కొరతను అధిగమిస్తుండటంతో ఈ మార్కెట్ పట్ల వ్యాపారులకు అపారమైన నమ్మకం ఏర్పడింది. హోల్‌సేల్ ఉల్లి దుకాణాలు జాతీయ రహదారి వెంబడి అందుబాటులోకి రావడంతో వాటి ధరలు నిలకడగా ఉంటున్నాయి.

ఇంతింతై వటుడింతై అన్న చందంగా..

మడికి బస్టాండ్ సెంటర్‌లోని తూర్పు డెల్టా ప్రధాన కాలువ వెంబడి స్థానిక రైతులు తమ సౌకర్యార్థం 1992లో కూరగాయల మార్కెట్‌ను నెలకొల్పారు. అప్పటి నుంచి ఆ మార్కెట్ ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అనతికాలంలోనే జాతీయ స్థాయిలో ఎగుమతులు చేసే స్థాయికి చేరుకుంది. గోదావరి పరీవాహక ప్రాంతాలైన ఆలమూరు, ఆత్రేయపురం, కడియం, కపిలేశ్వరపురం, రాజమహేంద్రవరం రూరల్‌తో పాటు చాగల్నాడు, మెట్ట ప్రాంతాలైన జగ్గంపేట, సీతానగరం, రాజానగరం, కోరుకొండ, గోకవరం, నిడదవోలు, కొవ్వూరు తదితర మండలాల్లో యేటా సుమారు పది వేల ఎకరాల్లో చిన్న, సన్నకారు రైతులు కూరగాయల సాగు చేస్తున్నారు. వీరంతా ఉదయం, సాయంకాలం సమయంలో కోసిన కూరగాయలను స్థానిక కూరగాయల మార్కెట్‌కు తరలిస్తారు. మార్కెట్‌కు చేరుకున్న సుమారు 500 టన్నుల కూరగాయలను స్థానిక అవసరాలకు పోను మిగిలిన తాజా కూరగాయలను ఏజెంట్ల ద్వారా ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు ఎప్పటికప్పుడు ఎగుమతులు చేస్తారు. ఒక్కొక్కసారి సమీపంలోని రాజమహేంద్రవరం, రావులపాలెంలో ఉన్న కూరగాయల మార్కెట్లకు కూడా రైతులు తమ పంట ఉత్పత్తులను తరలించి గిట్టుబాటు ధర పొందుతున్నారు.



మడికిలోని అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్



రైతులు–వినియోగదారులకు ఉపయోగం

మడికి కూరగాయల మార్కెట్ ఇటు రైతులకు, అటు వినియోగదారులకు ప్రయోజనకరంగా ఉంటోంది. జాతీయ రహదారి చెంతనే ఉండటంతో రైతులు పండించిన ఉత్పత్తులను తమ సొంత వాహనాల్లో తరలించడం వల్ల రవాణా చార్జీల ప్రభావం అంతగా ఉండదు. పైగా తోటల్లో కోసిన గంటల వ్యవధిలోనే మార్కెట్‌కు చేరుకోవడంతో మడికి మార్కెట్‌లోని తాజా కూరగాయలకు ఎనలేని డిమాండ్ ఏర్పడింది. దీనివల్ల కూరగాయల సాగు ఆశాజనకంగా ఉండటంతో సుమారు 70 వేల మంది రైతులు ప్రత్యక్షంగాను మరో రెండు లక్షల మంది పరోక్షంగాను ఈ మార్కెట్‌పై ఆధారపడి జీవిస్తున్నారు. కరోనా వైరస్ విజృంభించిన సమయంలోనూ నిబంధనలు పాటిస్తూ కూరగాయలను సరఫరా చేసి కొరత లేకుండా చూసిన రైతులు, వ్యాపారుల సేవలు ఇప్పటికీ జిల్లా వ్యాప్తంగా ప్రజానీకం అంతా గుర్తుంచుకుంది. ఆ సమయంలో మడికి కూరగాయల మార్కెట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది.



బడుగువానిలంక తోటలో వంకాయలను కోస్తున్న రైతులు



మడికి మార్కెట్ నుంచి కూరగాయలు ఎగుమతి చేస్తున్న కూలీలు

కోల్డ్ స్టోరేజీ (శీతల గిడ్డంగి) అందుబాటులోకి వస్తే..

కూరగాయల సాగు, క్రయ విక్రయాలకు ప్రసిద్ధి గాంచిన మడికి మార్కెట్‌కు అనుసంధానంగా కోల్డ్ స్టోరేజీని నిర్మిస్తే రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఒక్కొక్కసారి ఒక్కొక్క రకం ఉత్పత్తి అధికంగా ఉండటం వల్ల ధర ఏ మాత్రం రైతులకు లాభించడం లేదు. కోల్డ్ స్టోరేజీలు అందుబాటులోకి వస్తే అధికంగా ఉత్పత్తి అయ్యే కూరగాయలను కొద్ది రోజులపాటు నిల్వ చేసుకునే వీలు కలుగుతుంది. ఒక్కొక్కసారి దారుణంగా కిలో రూపాయికి పడిపోయే టమాటా మరొకసారి కిలో రూ.వంద వరకూ ఉండటాన్ని రైతులు ఇందుకు ఉదాహరణగా చెబుతున్నారు.

రైతులందరికీ గిట్టుబాటు ధర



రైతుల అభ్యున్నతి కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న ఈ మార్కెట్‌కు వస్తున్న ప్రతి పంట ఉత్పత్తికి సరియైన గిట్టుబాటు ధర వచ్చేందుకు కృషి చేస్తాం. రైతులకు, వ్యాపారులకు సంధాన కర్తగా ఉంటూ నామమాత్రపు రుసుంతో మార్కెట్‌లో సేవలను అందిస్తున్నాం. అనతికాలంలోనే ఈ మార్కెట్ రైతుల అభిమానాన్ని చూరగొంది.

– చెల్లబోయిన సింహాచలం, కూరగాయల మార్కెట్, మడికి

అన్ని రకాల కూరగాయలు అందుబాటులో..



పరిసర ప్రాంతాల్లో కూరగాయల సాగు అధికంగా ఉండటం వల్ల మడికి మార్కెట్‌లో అన్ని రకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల ఇతర ప్రాంతాలకు వెళ్లి కూరగాయలను కొనుగోలు చేసే అవసరం ఉండదు. రోజువారీ ఉత్పత్తిని బట్టి డిమాండ్ మేరకు కూరగాయాలను విక్రయిస్తాం.

– చిన్నం రాజు, కూరగాయల వ్యాపారి, ఆలమూరు

ఆశాజనకంగా సాగు



జాతీయ స్థాయి కూరగాయల మార్కెట్ సమీపంలో ఉండటం వల్ల పండించిన కూరగాయలకు సరియైన గిట్టుబాటు ధర లభిస్తోంది. కూరగాయల సాగు ఆశాజనకంగా ఉండటంతో ఇతర రకాల సాగుపై దృష్టి సారించాం. సీజన్‌లో అధిక లాభాలను ఆర్జిస్తున్నాం.

– బుద్దిగ వీర వెంకట్రావు, రైతు, చెముడులంక

అయినవిల్లి ఆలయం కిటకిట

అయినవిల్లి: విఘ్నేశ్వరుని ఆలయంలో ఆదివారం భక్తులు సందడి చేశారు. ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామికి మేలుకోల్పు సేవ నిర్వహించారు. అనంతరం స్వామికి విశేష పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి లఘున్యాస అభిషేకాల్లోను, లక్ష్మీగణపతి హోమంలోనూ భక్త దంపతులు పాల్గొన్నారు. స్వామివారికి గరిక పూజ జరిపారు. పంచామృత అభిషేకం, ప్రత్యేక అభిషేకాల్లో 53 మంది భక్తదంపతులు, స్వామివారి ప్రత్యేక దర్శనంలో 642 మంది భక్తులు, శ్రీ లక్ష్మీ గణపతి హోమంలో 31 మంది పూజలు నిర్వహించారు. 58 మంది తమ నూతన వాహనాలకు పూజ నిర్వహించారు. 72 చిన్నారులకు నామకరణలు, అక్షరాభ్యాసాలు నిర్వహించారు. 12 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి వివిధ పూజలు, అన్నదాన విరాళాల ద్వారా రూ.1,13,679 లభించిందని ఆలయ ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు తెలిపారు.



స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

16వ తేదీ నుంచి అంతర్వేది ఉత్సవాలు

సఖినేటిపల్లి: అంతర్వేది పుణ్యక్షేత్రంలో ఈ నెల 16 నుంచి 25 వరకూ నిర్వహించే శ్రీలక్ష్మీనృసింహ స్వామివారి వార్షిక దివ్య తిరు కల్యాణ మహోత్సవాల షెడ్యూల్‌ను దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. 16న రథసప్తమి, సూర్య వాహనం, చంద్రప్రభ వాహనాలపై గ్రామోత్సవాలు. స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుని, పెండ్లికుమార్తెను చేయడం (ముద్రికాలంకరణ). 17న గరుడ పుష్పక, పుష్ప వాహనాలపై స్వామివారి గ్రామోత్సవాలు. 18న హంస, శేషవాహనాలపై గ్రామోత్సవాలు, సాయంత్రం ధూపసేవ అనంతరం ధ్వజారోహణ. 19న పంచముఖ ఆంజనేయస్వామి, కంచుగరుడ వాహనాలపై గ్రామోత్సవాలు, రాత్రి 12–29 గంటలకు ఆరుద్రా నక్షత్రయుక్త వృశ్చిక లగ్న పుష్కరాంశలో స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం. 20న భీష్మ ఏకాదశి పర్వదినాన రథోత్సవం. 21న గజ, పొన్న వాహనాలపై గ్రామోత్సవాలు, రాత్రి అన్న పర్వత మహానివేదన. 22న హనుమద్వాహనం, సింహవాహనంపై గ్రామోత్సవాలు, సదస్యం. 23న రాజాధిరాజ, అశ్వవాహనంపై గ్రామోత్సవాలు, 16 స్తంభాలల మంటపం వద్ద చోరసంవాదం ఘట్టం. 24న పౌర్ణమి రోజున చక్రవారి సముద్ర స్నానం(పౌర్ణమి స్నానాలు), గరుడ పుష్పక వాహనంపై గ్రామోత్సవం, అవభృథోత్సవం, రాత్రి ధ్వజ అవరోహణ. 25న పుష్పక వాహనంపై గ్రామోత్సవం. సాయంత్రం అంతర్వేది చెరువులో హంస వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్ల తెప్పోత్సవం. రాత్రి ఉత్సవరులకు తిరుమంజనములు, దర్పణసేవ, ధూపసేవ, ద్వాదశ తిరువారాధన, విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, శ్రీ పుష్పోత్సవం, చెంగోలం విన్నపం, తీర్థగోష్ఠి, స్వామివారి పవళింపు సేవ తదితర వాటితో ఉత్సవాలు ముగుస్తాయి.



లక్ష్మీనృసింహుని దేవస్థానం



స్వామివారి మూలవిరాట్టు

పురాణ ప్రాశస్త్యం

నవ నారసింహక్షేత్రాల్లో పురాణ ప్రసిద్ధి చెందినది అంతర్వేది పుణ్యక్షేత్రం. ఈ క్షేత్రంలో వేకువ జామున నిజరూపానికి పంచామృత అభిషేకం నిర్వహిస్తారు. కృతయుగం ఆరంభంలో సృష్టికర్త బ్రహ్మ రుద్ర యాగం చేయడానికి నిర్ణయించి, ఆ యాగ వేదికను సాగర సంగమ తీరమైన అంతర్వేదిలో నిర్మించినట్టు ఆలయ చరిత్ర చెబుతోంది. బ్రహ్మ యాగ వేదికగా ఉన్న ఈ గ్రామానికి తొలుత అంతర్వేదికగా పేరొచ్చింది. కాలక్రమంలో అది అంతర్వేదిగా స్థిరపడింది.

పరీక్షా కాలం.. ఆరోగ్యం పదిలం

- చదువుకు ప్రణాళిక అవసరం
- అదే సమయంలో సమతుల ఆహారం తీసుకోవాలి
- తగినంత నిద్ర ఉండాలి
- వీటిపై అశ్రద్ధ వద్దు
- అప్పుడే విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు
- నిపుణులు, వైద్యుల సూచనలు

కాకినాడ సిటీ: ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షల కాలం నడుస్తోంది. ఇప్పటికే ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇంటర్, పదో తరగతి, ఓపెన్ ఇంటర్, టెన్త్ విద్యార్థులతో పాటు డిగ్రీ పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. ప్రస్తుత కాలం విద్యార్థుల ప్రతిభకు మాత్రమే కాదు.. ఆరోగ్యానికి కూడా పరీక్ష పెడుతుంది. పరీక్షల సమయం దగ్గర పడుతూండటంతో విద్యార్థులు పాఠ్య పుస్తకాలు చదవడంతో పాటు ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు. పరీక్షలు అనగానే సాధారణంగా విద్యార్థులపై ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. దీనిని అధిగమించేందుకు, చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా ఉండేందుకు ప్రతి విద్యార్థీ ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని నిపుణులు, వైద్యులు సూచిస్తున్నారు. ప్రణాళికతో చదవడంతో పాటు.. సమయానికి సమతుల ఆహారం తీసుకోవడం, కంటి నిండా నిద్ర పోవడం చాలా ముఖ్యమని చెబుతున్నారు. పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు ఆహార నియమాలు పాటిస్తేనే ఏకాగ్రత, ఆరోగ్యం లభిస్తాయని సూచిస్తున్నారు.

ఏకాగ్రతకు..

- మసాలాలతో కూడిన ఆహారాన్ని విద్యార్థులు దరి చేరనీయకూడదు.
- సులభంగా జీర్ణమయ్యే ఆకుకూరలు ఆహారంలో పుష్కలంగా తీసుకోవాలి.
- ఉదయాన్నే రాగి జావ తాగాలి.
- వీధుల్లో విక్రయించే ఫాస్ట్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలి.
- రోజూ రెండుపూటలా స్నానం చేస్తూ పరిశుభ్రత పాటించాలి.
- పరిశుభ్రమైన నీరు తాగాలి. నీరసంగా ఉంటే కొబ్బరి నీరు తాగాలి. శీతల పానీయాలు తాగకూడదు.
- ప్రస్తుతం పగలు ఎండ, రాత్రి చలి వాతావరణం ఉంటోంది. అందువలన ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలి.
- నీరు ఎక్కువగా తాగుతూ రోజూ 15 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి.
- అరటి పండు తీసుకుంటే ఏకాగ్రత పెరుగుతుంది.

పరిశుభ్రతతో ఉత్సాహం

- పరీక్షల సమయంలో విద్యార్థులు ఉత్సాహంగా ఉండాలంటే పరిశుభ్రత పాటించాలి.
- చదువుపై ఆసక్తి, ఆతృతతో స్నానం చేయడాన్ని నిర్లక్ష్యం చేస్తారు. ఫలితంగా శరీర శుభ్రత లోపించి, వివిధ వ్యాధులు సంక్రమించి, పరీక్షల సమయానికి డీలా పడతారు.
- రెండు పూటలా స్నానం చేయకపోతే చర్మం పొడిబారడం, చెమటతో గజ్జి, తామర వంటి ఫంగస్ వ్యాధులు వస్తాయి.
- అతిగా చదివి నీరసపడితే కళ్లు లోపలికి పీక్కుపోతాయి. అధిక దాహం, మూత్రం సరిగా రాకపోవడంతో పాటు జ్వరం వచ్చే ప్రమాదం ఉంటుంది.

ఈ తీసుకుంటే మేలు

- కాచి చల్లార్చిన నీటిని రోజుకు రెండు లీటర్ల వరకూ తీసుకోవాలి.
- నీటి శాతం అధికంగా ఉండే పుచ్చకాయ, బత్తాయి వంటి పండ్ల రసాలు పంచదార వేయకుండా తాగాలి.
- సాయంత్రం వేళ 200 మిలీలీటర్ల అన్నం గంజి లేదా బార్లీ తాగితే మేలు.
- రోజుకు 300 మిల్లీ లీటర్ల కొబ్బరి నీరు, గ్లూకోజ్ నీరు, కొద్దిగా ఉప్పు కలిపిన మజ్జిగ తీసుకోవాలి.

కాఫీ, టీ మోతాదు మించకూడదు

- కాఫీ, టీలు తాగితే కొంత వరకూ ఉత్తేజాన్ని ఇస్తాయి. మోతాదు మించితే ఇవి ప్రమాదమే. పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులు వీటికి దూరంగా ఉండటం మేలు.
- ఎక్కువసేపు మేల్కొని ఉండటానికి కాఫీలు, టీలు అతిగా తాగకూడదు.
- కప్పు కాఫీలో 80 నుంచి 120 మిల్లీగ్రాముల కెఫీన్ ఉంటుంది. ఇన్‌స్టెంట్ కాఫీలో 50–60 మిల్లీగ్రాములు, టీలో 60–65 మిల్లీగ్రాములు కెఫీన్ ఉంటుంది. ఇది 200 గ్రాములు దాటితే భయం, ఆదుర్దా వంటి వాటికి ఆస్కారం ఉంటుంది.

సాత్విక ఆహారంతో ఆరోగ్యం

- పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు సాత్విక ఆహారం తీసుకోవడం ప్రారంభించాలి.
- ఆహారం పరిశుభ్రంగా, సమతుల పోషక విలువలు ఉండేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి. ఆహారం తీసుకోవడంలో విధిగా సమయం పాటించాలి.
- చదివి అలసిన విద్యార్థులు పండ్ల రసాలు అధికంగా తీసుకుంటే శారీరకంగా ఉత్సాహం, మానసికంగా ఉల్లాసం చేకూరుతాయి.
- పరీక్షల సమయంలో స్వీట్లు, చాక్లెట్లు, నూనె పదార్థాలు తినకూడదు.
- మంచి ఆలోచనలు దారి తప్పకుండా చిట్కాలు పాటించాలి.

నిద్రపై నిర్లక్ష్యం వద్దు

- అలసిన శరీరానికి నిద్ర తగినంత ఉపశమనాన్ని ఇస్తుంది.
- పరీక్షల సమయంలో నిద్ర లేకుండా చదివినా అనారోగ్యానికి గురవుతారు.
- రోజూ 8 గంటల పాటు నిద్రపోయేలా చూసుకోవాలి.
- సోయాబీన్ పిండి కలిపిన మజ్జిగ తాగితే నిద్ర రాకుండా శక్తి వస్తుంది.
- పరీక్షల సమయంలో మాంసాహారానికి దూరంగా ఉండటం ఉత్తమం. మాంసాహారం జీర్ణమయ్యేందుకు ఎక్కువ సమయం తీసుకుంటుంది. దీనివలన మెదడుకు అవసరమైన మేరకు ఆక్సిజన్ అందకుండా మత్తుగా ఉంటుంది.
- రాత్రి వేళ పది గంటల సమయంలో పాలు తాగడం మేలు.



ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



ప్రతి విద్యార్థీ ఆరోగ్యంగా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి. టీ, కాఫీలకు దూరంగా ఉంటే మంచిది. సాత్విక ఆహారం ముఖ్యంగా పండ్లు, త్వరగా జీర్ణమయ్యే పదార్థాలు తీసుకుంటే మంచిది. దీనివలన చదువుపై ఏకాగ్రత పెరిగి అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరు. రాత్రి వేళ నిర్ణీత సమయం వరకూ మాత్రమే చదవాలి. ప్రతి రోజు 8 గంటల నిద్ర అవసరం. ఉదయమే లేచి చదువుకోవాలి. దీనివల్ల చదివిన అంశాలు ఎక్కువగా గుర్తుంటాయి. తల్లిదండ్రులు తమ పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూండాలి. విద్యార్థిపై ఒత్తిడి తగ్గించాలి.

– ఇళ్ల దోసగిరిరావు, విశ్రాంత ప్రొఫెసర్, ఆంధ్రా యూనివర్సిటీ క్యాంపస్, కాకినాడ

విద్యార్థులపై ఒత్తిడి పెంచవద్దు



విద్యార్థులు వేళకు ఆహారం తినేలా, కంటి నిండా నిద్ర పోయేలా తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి. ఇతరులు విద్యార్థులు చదువుతున్నప్పుడు హేళన చేయడం, వారితో పోల్చి బాధ పెట్టడం, మనసు గాయపరిచేలా మాట్లాడటం వంటివి చేయరాదు. పిల్లలల్లో ఆత్మస్థైర్యాన్ని నింపాలి. వారిపై ఒత్తిడి పెంచరాదు. పరీక్షల సమయంలో పిల్లలతో తల్లిదండ్రులు తరచూ మాట్లాడాలి. చదువుపై ఏకాగ్రత కోల్పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్యపరమైన ఇబ్బందులేవయినా తలెత్తితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆరోగ్యంపై బాగుంటేనే విద్యార్థులు చదువుపై దృష్టి కేంద్రీకరించగలరు.

– డాక్టర్ కె.రత్నకుమార్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, కాకినాడ

క్లుప్తంగా

గోదావరిలో పడి వ్యక్తి మృతి

సీతానగరం: మండలంలోని రాజంపేటకు చెందిన మైలపల్లి గురుమూర్తి (35) ప్రమాదవశాత్తూ గోదావరిలో పడి మృతి చెందాడని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు ఆదివారం తెలిపారు. వెదుళ్లపల్లి పంచాయతీ పరిధిలోగల రాజంపేటకు చెందిన గురుమూర్తి శనివారం సాయంత్రం 6 గంటలకు గోదావరి ఒడ్డున మూత్ర విసర్జన చేస్తుండగా ప్రమాదవశాత్తు గోదావరిలో పడిపోయాడని, అక్కడ ఉన్న కొంతమంది గురుమూర్తిని బయటకు తీయగా అప్పటికే మరణించాడన్నారు. మృతుని బావ సూరాడ అప్పన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు తెలిపారు. మృతునికి తల్లిదండ్రులు గొర్రెమ్మ, పెద్దంకాలు, భార్య దానమ్మ, పన్నెండేళ్ల కుమార్తె నాగలక్ష్మి, ఎనిమిది నెలల పాప ఉన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం – కొవ్వూరు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని సుమారు 30–35 సంవత్సరాల వయసు గల వ్యక్తి మృతి చెంది ఉన్నాడని రాజమహేంద్రవరం జీఆర్పీ ఎస్సై మావుళ్లు ఆదివారం తెలిపారు. మృతుడు ఖాకీ రంగు షర్టు, షార్టును ధరించి ఉన్నాడన్నారు. మృతిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మావుళ్లు తెలిపారు. మృతుని గురించి వివరాలు తెలిసిన వారు 08832442821, 9491003239 నంబర్లకు ఫోన్ చేసి చెప్పాలని కోరారు.

శతాధిక వృద్ధురాలి మృతి



వరలక్ష్మి (ఫైల్)

అంబాజీపేట: పుల్లేటికుర్రుకు చెందిన శతాధిక వృద్ధురాలు గంగుమళ్ల వరలక్ష్మి (పిచ్చమ్మ) (101) ఆదివారం మృతి చెందారు. ఆమెకు అయిదుగురు సంతానం, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. తొమ్మిది మంది మనుమలు, మనుమరాండ్రు, 14 మంది మునిమనుమలు, మనమరాండ్రు ఉన్నారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కాకినాడ క్రైం: ఎద్దు గుద్దిన ఘటనలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. కాకినాడ తిలక్ వీధికి చెందిన కుంచెం రామభద్రరావు(85) ఈ నెల 7వ తేదీన ఇంటి నుంచి బయటికి వెళ్లాడు. కాలినడకన వెళ్లిన అతడిని రోడ్డుపై ఉన్న ఓ ఎద్దు బలంగా గుద్దింది. దీంతో రామభద్రరావు అక్కడే ఉన్న డ్రైనేజీలో పడిపోయాడు. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయం కావడంతో చికిత్స పొందుతూ కాకినాడ జీజీహెచ్‌లో క్షతగాత్రుడు మృతి చెందాడు. ఘటనపై కాకినాడ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చరిత్రలో చెప్పుకొనేలా..



ముమ్మిడివరం వ్యూ

- ముమ్మిడివరంలో ప్రగతి బావుటా
- ఐదేళ్లలో ఎనలేని అభివృద్ధి
- మారిన నగర పంచాయతీ రూపురేఖలు
- విశాలమైన రోడ్లు, ఆధునిక సదుపాయాలు
- రూ.142.72 కోట్లతో పనులు
- ప్రజా సంక్షేమానికి రూ.55.95 కోట్లు



ముమ్మిడివరం పురపాలక సంఘ కార్యాలయం

ముమ్మిడివరం: అభివృద్ధి పురుడు పోసుకుంది.. అన్నింటా ప్రత్యేకత చాటుతోంది.. ప్రగతి కుసుమం వెల్లివిరిసింది.. ఐదేళ్ల నుంచి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముమ్మిడివరం నగర పంచాయతీ రూపురేఖలే మారింది. ముప్ఫై ఏళ్ల నుంచి మేజర్ పంచాయతీ ఉన్నా ఎటువంటి అభివృద్ధి జరుగలేదు. ఎనిమిదేళ్ల కిందట నగర పంచాయతీగా రూపాంతరం చెందినా, వైఎస్సార్ ప్రభుత్వం వచ్చిన తరువాత నుంచి రూ.200 కోట్లతో అభివృద్ధి, సంక్షేమానికి కేటాయించడంతో అన్ని రంగాల్లో తనదైన శైలిలో దూసుకుపోతోంది. జిల్లా విభజనతో ఈ ప్రాంతం మరింత ప్రగతి పథాన పయనిస్తోంది. జిల్లాకు సంబంధించి ప్రధాన ప్రభుత్వ శాఖల కార్యాలయాలు ముమ్మిడివరంలో ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతానికి ప్రాధాన్యం సంతరించుకుంది. సువిశాలమైన రోడ్లు, రెసిడెన్షియల్ ఏరియా, గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రియల్ జోన్ వంటి ఆధునాతన సదుపాయాలతో ప్రణాళికలు సిద్ధం చేశారు.

మేజర్ పంచాయతీగా ఉన్న ముమ్మిడివరం 2013లో నగర పంచాయతీగా రూపాంతరం చెందింది. గత టీడీపీ పాలకవర్గంలో నగర పంచాయతీగా ఏర్పడినా ప్రజలపై పన్నుల భారం వేశారే తప్ప అభివృద్ధి మాత్రం శూన్యమనే చెప్పాలి. 2021లో నగర పంచాయతీలో వైఎస్సార్ సీపీ పాలకవర్గం ఏర్పడింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ సహకారంతో ముమ్మిడివరం అభివృద్ధి వైపు అడుగులు వేసింది. ఇందులో భాగంగా విద్యార్థుల కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వచ్చింది. నగర పంచాయతీని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ కుమార్ ఆధ్వర్యంలో 20 ఏళ్ల కాల పరిమితితో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి కౌన్సిల్ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించారు. 216 జాతీయ రహదారిని ఆనుకుని ప్రస్తుతం 10 నుంచి 15 అడుగులున్న రహదారులను 40 అడుగులకు పెంచి అభివృద్ధి చేశారు.

ప్రగతి పుష్కలం

ప్రజలందరికీ తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏఐఐబీ బ్యాంకు నిధులు రూ. 133.66 కోట్లతో సమగ్ర మంచినీటి పథకాన్ని నిర్మించారు. తద్వారా మారుమూల ప్రాంతాలకు సైతం పైపులైన్లు ఏర్పాటు చేసి తాగు నీరందించే చర్యలు చేపట్టారు. ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి బొబ్బర్లంక నుంచి గోదావరి జలాలను తీసుకువచ్చి శుద్ధి చేయడం ద్వారా ప్రజలకు నీరు సరఫరా చేస్తున్నారు.

- 15 ఆర్థిక సంఘం నిధులు రూ. 5.70 కోట్లతో మారుమూల గ్రామాల్లో సైతం సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించారు. పుంత రోడ్లు సైతం అభివృద్ధికి నోచుకున్నాయి.
- స్థానిక 10 వార్డు అంబేడ్కర్ నగర్‌లో రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్ రూపుదిద్దుకుంది.
- రూ.కోటి నిధులతో నగర నడి ఒడ్డున డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్ నిర్మించారు.
- నగర పంచాయతీ పరిధిలో వివిధ పథకాల కింద 16,520 మంది లబ్ధిదారులకు రూ. 55.95 కోట్లు అందించారు.
- జగనన్న కాలనీల కోసం ప్రభుత్వం 26.65 ఎకరాల భూమిని సేకరించి 8 లేఅవుట్లు ఏర్పాటు చేసింది. సుమారు 1,314 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేసింది. 476 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ రుణాలు మంజూరు చేయగా నిర్మాణ దశలో ఉన్నాయి. కాలనీల్లో రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించారు.

అందంగా తీర్చిదిద్దాం..



వైఎస్సార్ ప్రభుత్వ పాలనలో ముమ్మిడివరం నగర పంచాయతీని అందంగా తీర్చిదిద్దాం. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రోత్సాహంతో మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వ ఆమోదం లభించింది. రాబోయే ఇరవై ఏళ్లలో అన్ని హంగులతో ముమ్మిడివరం రూపుదిద్దుకుంటోంది. ప్రత్యేక నిధులతో మారుమూల గ్రామాల్లో సైతం రోడ్లు అభివృద్ధి చేశాం. ఏఐఐబీ బ్యాంకు నిధులు రూ. 133.66 కోట్లతో మంచి నీటి పథకాన్ని నిర్మించాం.

–కమిడి ప్రవీణ్‌కుమార్, చైర్మన్, నగర పంచాయతీ ముమ్మిడివరం

మోడల్ మున్సిపాలిటీగా ముమ్మిడివరం



నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరాన్ని మోడల్ మున్సిపాలిటీగా మార్చుతాం. ఏఐఐబీ బ్యాంకు సహకారంతో బృహత్తర మంచినీటి పథకాన్ని ప్రారంభించి ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందిస్తున్నాం. ప్రత్యేక నిధులు సమకూర్చి సీసీ రోడ్లు, మురుగునీరు దిగేందుకు సీసీ డ్రైన్లు నిర్మించాం. ప్రజలకు అనువైన రెసిడెన్షియల్ ఏరియా, కమర్షియల్ కారిడార్, గ్రీన్‌బెల్ట్, ఇండస్ట్రియల్ జోన్, విశాలమైన రోడ్లు ఏర్పాటు వంటి సౌకర్యాలు సమకూరేలా ప్లాన్ సిద్ధం చేశాం.

–పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎమ్మెల్యే, ముమ్మిడివరం

ముమ్మిడివరం విస్తీర్ణం	: 26 చదరపు కిలోమీటర్లు
జనాభా	: 26,146 మంది
ఓటర్లు	: 20,956
పురుషులు	: 10,293
మహిళలు	: 10,663

ఐదేళ్లలో మంజూరైన నిధులు

ఏఐఐబీ బ్యాంకు	: రూ. 133.66 కోట్లు
ఏఎఫ్‌సీ	: రూ. 1.50 కోట్లు
15 ఆర్థిక సంఘం	: రూ. 5.70 కోట్లు
అర్బన్ హెల్త్ సెంటర్ ప్రత్యేక నిధులు	: రూ. 80లక్షలు
గడప గడపకూ మన ప్రభుత్వం నిధులు	: రూ. 2.80 కోట్లు
ఎంపీ ల్యాడ్స్	: రూ.20 లక్షలు



ముమ్మిడివరంలో ఓవర్ హెడ్ ట్యాంకు

ఇద్దరు యువకుల దుర్మరణం

- యర్రపోతవరం వద్ద రోడ్డు ప్రమాదం
- కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లులు



ఘటనా స్థలిలో యువకుల మృతదేహాలు



పిల్లి ప్రసాద్



దుర్గాడి జాన్

కె.గంగవరం: యానాం–ద్రాక్షారామ రహదారిలో కె.గంగవరం మండలం యర్రపోతవరం లాకుల వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పిల్లి దుర్గాప్రసాద్(28), దుర్గాడి జాన్(26) మృతి చెందారు. ఎస్సై జానీ బాషా తెలిపిన వివరాల ప్రకారం అనపర్తి మండల లక్ష్మీనరసాపురానికి చెందిన పిల్లి దుర్గాప్రసాద్, దుర్గాడి జాన్ స్థానికంగా తాపీ పని చేసేవారు. వీరిద్దరికీ తండ్రులు లేకపోవడంతో ప్రసాద్ తల్లి నాగమణి, జాన్ తల్లి సీత వద్ద ఉంటున్నారు. వీరు కొడుకులు సంపాదించే రోజు వారీ ఆదాయంతోనే బతకాల్సిన పరిస్థితి ఉంది. అయితే ఆదివారం ఉదయం దుర్గాప్రసాద్, జాన్ మోటారు సైకిల్‌పై యానాం వెళ్లి మధ్యాహ్నం తిరిగి సొంత గ్రామమైన లక్ష్మీనరసాపురం వస్తున్నారు. యర్రపోతవరం లాకుల వద్దకు వచ్చే సరికి ద్రాక్షారామ నుంచి యానాం వైపు వెళ్తున్న లారీని వీరు బలంగా ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న రామచంద్రపురం సీఐ దొరరాజు, ఎస్సై జానీబాషా ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి బంధువులకు సమాచారం అందించారు. రెండు మృతదేహాలకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. అందరితో కలుపుగోలుగా ఉండే ప్రసాద్, జాన్ మృతితో స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. తమ కుటుంబాలకు ఆధారమైన కొడుకులను కోల్పోవడంతో ఆ తల్లులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

చిన్నారులపై కన్న తండ్రి అఘాయిత్యం

- భార్యపై కోపంతో పిల్లలపై పెట్రోలు పోసి అంటించిన వైనం
- తీవ్ర గాయాలతో కాకినాడ ప్రభుత్వాసుత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు
- తండ్రికి స్వల్ప గాయాలు



తీవ్రగాయాలతో బూడి సందీప్



తీవ్రగాయాలతో ఏడాదిన్నర చిన్నారి



స్వల్ప గాయాలతో సాయికుమార్

రాజమహేంద్రవరం రూరల్: భార్యపై ఉన్న కోపంతో తను కంటికి రెప్పలా కాపాడాల్సిన కుమారుడు, కుమార్తెపై పెట్రోలు పోసి అంటించి తన పైశాచికత్వాన్ని చాటుకున్న తండ్రి ఉదంతం శాటిలైట్‌సిటీ గ్రామం రాజీవ్ గృహకల్ప సముదాయంలో శనివారం రాత్రి 10.30గంటల సమయంలో చోటు చేసుకుంది. చిన్నారుల ఇద్దరు కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో తీవ్రగాయాలతోను, తండ్రి కూడా స్వల్పగాయాలతో చికిత్స పొందుతున్నారు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం శాటిలైట్‌సిటీ రాజీవ్ గృహకల్ప సముదాయంలో జీ–5ప్లాట్ నంబరు 102లో బూడి సాయికుమార్ నివసిస్తున్నాడు. అతనికి ఐదేళ్ల క్రితం కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం ఎర్రవరం గ్రామానికి చెందిన బూడి దుర్గతో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల బూడి శివదుర్గాసందీప్, ఏడాదిన్నర పాప ఉంది. ఏడాదిన్నర క్రితం సాయికుమార్ భార్య పురిటి కోసం పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి భర్త వద్దకు రాలేదు. గత 20రోజుల నుంచి సాయికుమార్ అత్తవారింటికి వెళ్లి భార్యతో గొడవ పడ్డాడు. నాలుగేళ్ల కుమారుడు సాయికుమార్ తల్లి శ్రీదేవి వద్దే ఉంటున్నాడు. ఏడాదిన్నర కుమార్తె భార్య దుర్గ వద్ద ఉంటోంది. సాయికుమార్ భార్య వద్ద ఉన్న ఏడాదిన్నర పాపను ఇంటికి తీసుకువచ్చి తల్లి వద్దే ఉంచాడు. శనివారం రాత్రి తల్లి శ్రీదేవి వద్ద ఇద్దరు పిల్లలను సాయికుమార్ తన వద్ద పడుకోబెట్టుకుంటానని చెప్పి తీసుకువచ్చాడు. రాత్రి పదిగంటల సమయంలో సాయికుమార్ భార్యపై ఉన్న కోపంతో పిల్లలను కొట్టడంతో పాటు, ఏడాదిన్నర పాపను బాత్‌రూంలో పెట్టి పెట్రోలు పోసి అంటించడంతోపాటు, నాలుగేళ్ల సందీప్‌పైన పెట్రోలు పోసి అంటించాడు. ఈ సమయంలో సాయికుమార్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. పిల్లల అరుపులకు చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆపి చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో సందీప్, ఏడాదిన్నర కుమార్తె తీవ్రగాయాలతోను, తండ్రి సాయికుమార్ స్వల్ప గాయాలతో చికిత్స పొందుతున్నారు. ఘటనా స్థలాన్ని బొమ్మూరు పోలీసులు, వీఆర్వో ఆర్.రత్నకుమారి పరిశీలించారు.

కన్న పిల్లలపై కనికరం లేదా...

భార్యతో గొడవపడి అల్లారుముద్దుగా పెంచుకుంటున్న కన్నపిల్లలపై కర్కశకంగా పెట్రోలు పోసి అంటించడంపై సాయికుమార్‌పై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అభంశుభం ఎరగని చిన్నారులపై పెట్రోలు పోసి అంటించడానికి చేతులు ఎలా వచ్చాయని మండిపడుతున్నారు. ఈ ఘాతుకానికి పాల్పడిన సాయికుమార్‌ను కఠినంగా శిక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

నేత్ర దానం



లక్ష్మీత్రివేణి

తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీకి చెందిన ధూళిపూడి లక్ష్మీ త్రివేణి (58) ఆదివారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ మేరకు సామాజిక కార్యకర్త లయన్ ధూళిపూడి వెంకట రమణ(బాబి) ఆమె కుటుంబ సభ్యులు భర్త రెడ్డినాయుడు, కుమారులు కన్నా, లోవ, రాజేష్‌లతో సంప్రదించి నేత్రదానానికి ఒప్పించారు. కాకినాడ బాదం బాలకృష్ణ ఐ బ్యాంక్ సిబ్బంది రవి, వీరేంద్రలు లక్ష్మీత్రివేణి కార్నియాలను సేకరించారు. నేత్రదానం చేయడం ద్వారా చూపులేని మరి కొంతమంది జీవితాల్లో వెలుగులు నింపిన వారవుతారని బాబి అన్నారు.

ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ

సీతానగరం: బొబ్బిల్లంకలో ఆంజనేయస్వామి వారి విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆదివారం బొబ్బిల్లంక సెంటర్ వద్ద 58 ఏళ్ల క్రితం మొట్టమొదటి రాతి విగ్రహం పునఃప్రతిష్ఠ కార్యక్రమంలో వేముల ఆంజనేయులు, వెంకటలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే పలువురు భక్తులు స్వామివారికి అభిషేకాలు చేశారు.

ఏకగ్రీవం

రాజానగరం: రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కార్యవర్గ ఎన్నిక గైట్ కళాశాలలో ఆదివారం జరిగింది. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జె.డేనియల్‌బాబు, ఎం.లక్ష్మణ్, ఆర్థిక కార్యదర్శిగా యు.అర్జునుడు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా ఎస్.వెంకటేశ్వరరావు వ్యవహరించారు.

దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు



నిందితులను అదుపులోకి తీసుకుంటున్న రైల్వే పోలీసులు

తుని: రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు స్థానిక జీఆర్పీ ఎస్సై షేక్ అబ్దుల్ మారూఫ్ తెలిపారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్థానిక రైల్వేస్టేషన్లో ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా ఒకటో నంబరు ప్లాట్‌ఫారంపై అనుమానాస్పదంగా తిరుగుతున్న బొబ్బిలికి చెందిన దత్తి శ్రీను(35), ప్రకాశం జిల్లాకు చెందిన వేటపాలెం పవన్‌కుమార్(29)లను ప్రశ్నించారు. వారు ప్రయాణికుల నుంచి దొంగిలించిన 9 సెల్‌ఫోన్లు, రూ. 2 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వ్యసనాలకు బానిసలై దొంగతనాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామన్నారు. స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు, నగదు తుని, సామర్లకోట రైల్వేస్టేషన్ల పరిధిలో దొంగిలించిన సొత్తుగా గుర్తించామని, వీటి విలువ రూ. 3.33 లక్షలు ఉంటుందన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్సైలు సత్యనారాయణ, గోవిందరాజు, హెచ్‌సీలు శ్రీనివాసరావు, రవికుమార్, కానిస్టేబుళ్లు రామకోటి, నాగరాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

రౌతులపూడిలో అగ్ని ప్రమాదం

5.75 లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో కాలి బూడిదైన వస్తువులు

రౌతులపూడి: స్థానిక శెట్టిబలిజపేటలో బత్తిన కన్నయమ్మ, గుబ్బల రామయమ్మ నివాసం ఉంటున్న పెంకుటింటిలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 5.75 లక్షల ఆస్తి నష్టం జరిగింది. కన్నయమ్మ ఉంటున్న గదిలో గ్యాస్ స్టవ్ వెలిగించగా ఒక్కసారిగా మంటలు ఏర్పడి ఇల్లంతా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో కన్నయమ్మ గదిలో ఉన్న ఫర్నిచరు, బీరువా, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారు నగలు, దుస్తులు, వంట సామగ్రి, కొంత నగదు కలిపి మొత్తం రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది. గుబ్బల రామయమ్మ గదిలో ఉన్న వంట సామగ్రి, ఫర్నిచరు, దుస్తులు కాలిపోయి రూ.75 వేలు నష్టం ఏర్పడినట్టు అంచనా వేశామని రెవెన్యూ అధికారులు నివేదికను రూపొందించారు.

బ్యాంకు చోరీపై ‘కోట’లో దర్యాప్తు



ట్రైనీ డీఎస్పీ ఆధ్వర్యంలో వేలి ముద్రలను పరిశీలిస్తున్న క్లూస్ టీము

సామర్లకోట: ప్రత్తిపాడు మండలం ఉత్తర కంచి బ్యాంకులో చోరీపై పోలీసులు సామర్లకోటలో ఆదివారం సాయంత్రం దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీన ఉత్తర కంచి స్టేట్‌బ్యాంకులో జరిగిన చోరీలో అనుమానితుల జాడపై పోలీసులు స్థానిక పిఠాపురం రోడ్డులో ఏరియాలో ఐదుగురు రూమ్ అద్దెకు తీసుకొని బ్యాంకు చోరీకి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ చోరీని సవాల్‌గా తీసుకోవడంతో దొరికిన ప్రతీ ఆధారాన్ని క్షుణంగా పరిశీలిస్తున్నారు. ఈ చోరీలో రూ.27 లక్షలు నగదు, .కోటి 43 లక్షలు విలువ కలిగిన బంగారు ఆభరణాలు చోరీకి గురి అయినట్టు పోలీసులు తెలిపారు. ట్రైనీ డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో క్లూసు టీమ్ వేలి ముద్రలు పరిశీలించింది. స్థానిక కోటబజార్ ప్రాంతంలో టూలెట్ బోర్డు పెట్టడంతో అబ్దుల్లా అనే వ్యక్తి వద్ద నెలకు రూ.మూడు వేలకు ఆ ఇంట్లో అద్దెకి దిగిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు 10 రోజుల పాటు ఉండి ఉత్తరకంచిలో రెక్కీ నిర్వహించినట్టు పోలీసులు భావిస్తున్నారు. సామర్లకోట సీఐ డి.సురేష్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన క్రైమ్ సిబ్బంది సామర్లకోటలో విచారణ ప్రారంభించారు. పిఠాపురం రోడ్డులో ఉన్న సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.

110 మద్యం బాటిళ్ల స్వాధీనం

తుని రూరల్: ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి 110 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్టు రూరల్ ఎస్సై రమేష్‌బాబు తెలిపారు. అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే ముందస్తు సమాచారం మేరకు లోవకొత్తూరు శివారులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. రౌతులపూడి మండలం ధార జగన్నాథపురం గ్రామానికి చెందిన గింజాల శ్రీను వద్ద ఉన్న 55 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. రాజుపేట వద్ద తనిఖీల్లో ధార జగన్నాథపురానికి చెందిన బర్ల వెంకటేష్ నుంచి 55 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై వివరించారు.

కల్యాణానికి రాట ముహూర్తం

పెదపూడి: మండలంలోని పుట్టకొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణానికి సర్పంచ్ వల్లు వెంకటరమణ, ఆలయ ధర్మకర్త, ఫౌండర్ పీఏ అనంతాచార్యులు రాట ముహూర్తం ఆదివారం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.అనంత గోపాలాచార్యులు అధ్వర్యంలో పండితులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ సీహెచ్‌వీ రమణమూర్తి మాట్లాడుతూ ఈ నెల 20న స్వామి కల్యాణం, రథోత్సవం నిర్వహించనున్నామన్నారు. ఆలయంలో ఈ నెల 10 నుంచి ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. భక్తులు, దాతలు, గ్రామస్తుల సహకారంతో కల్యాణం అనంతరం అన్నదానం నిర్వహిస్తామన్నారు.



రాట ముహూర్తం చేస్తున్న సర్పంచ్ వెంకటరమణ తదితరులు